గాడి తప్పిన రెవెన్యూ పాలన

- అస్తవ్యస్థంగా తయారైన వ్యవస్థ
- అందుబాటులో లేని వీఆర్వోలు
- విధులు మరిచి సొంత పనుల్లోకి
- ప్రైవేటు వ్యక్తుల పెత్తనం

■ చిత్తూరు మండలానికి చెందిన సుబ్రమణ్యం భార్య రెండేళ్ల క్రితం చనిపోయింది. గ్యాస్‌ను తన పేరుతో మార్చుకోవాలని లేట్ డెత్ సర్టిఫికెట్‌కు చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ మూడు నెలల నుంచి తిరుగుతున్నాడు. ఇంత వరకు ఆ సమస్య పరిష్కారం కాలేదు. ఇచ్చిన దరఖాస్తును కూడా ఎక్కడ పెట్టారో తెలియని పరిస్థితి. ఆ 70 ఏళ్ల వయసులో ఆ వృద్ధుడు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

■ నగరానికి చెందిన శ్రీకాంత్ గత నెల కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ఫారంపై వీఆర్‌ఓ సంతకం తీసుకోవడానికి ఐదు రోజుల సమయం పట్టింది. తర్వాత ప్రక్రియ పూర్తి కావడానికి 20 రోజుల కాలం పట్టింది. అప్పటికే దరఖాస్తుదారు అవసరం గడువు తీరిపోయింది. ఇలాంటి కేసులు చాలానే ఉన్నాయి.



చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

రెవెన్యూ సేవలకు కష్టాలొచ్చాయి. వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైంది. కీలకంగా పనిచేయాల్సిన వీఆర్‌ఓలు కొందరు దాగుడుమూతలాడుతున్నారు. విధులకు డుమ్మా కొడుతూ ప్రజా సేవకు తూట్లు పొడుస్తున్నారు. విధులను మరిచి సొంత పనులకు పరిమితమవుతున్నారు. దీంతో ప్రజలు అవస్థలు పడక తప్పడం లేదు. దీనిపై మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అర్బన్, రూరల్ ప్రాంతాలకు సంబంధించి నగరంలో వేర్వేరుగా రెండు తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. వీటికింద 41 రెవెన్యూ గ్రామాలుండగా, వీఆర్‌ఓలు 24 మందికి గాను 16 మంది పనిచేస్తున్నారు. వీరంతా కేటాయించిన ప్రాంతాల వారీగా విధుల్లోకి వెళ్లాల్సి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ప్రాంతాల్లోనే ఉండి ప్రజలకు సేవలందించాలి. కానీ కొందరు కాళ్లకు చక్రం కట్టుకుని తిరుగుతున్నారు. విధులకు సక్రమంగా హాజరు కావడంలేదనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, అదనపు బాధ్యతలు కేటాయించిన ప్రాంతంలో కూడా లేకుండా సొంత పనులు చూసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని అక్కడ కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలు సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రైవేటు భవనాల వరకు గాలించాల్సిన పరిస్థితి నెలకొంది.

అవస్థలు ఇలా...

అన్నింటి కంటే రెవెన్యూ వ్యవస్థ కీలకమైనది. ప్రజలు నిత్యం రెవెన్యూ సేవల కోసం తహసీల్దార్ కార్యాలయాలను ఆశ్రయిస్తుంటారు. ఈ తరుణంలో కొందరి వీఆర్‌ఓల జాడ అంతు చిక్కడం లేదు. సంతకాల కోసం ప్రజలు ఫోన్ చేసి వేడుకున్నా అదిగో..ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కుల, ధృవీకరణ పత్రం కోసం కూడా నానా అగచాట్లు పడుతున్నారు. అధికారులు కూడా వారి ఆచూకీ కోసం తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం కుల, ఆదాయ పత్రం దరఖాస్తు చేసుకుంటే 15రోజుల పైనే అవుతోంది. ఈ విషయంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికారణంగా అత్యవసర పరిస్థితుల్లో దరఖాస్తుదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల కోసం నరకం అనుభవిస్తున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి పత్రాలు జారీ చేసేందుకు నరకం చూపిస్తున్నారు. మ్యుటేషన్, ఇతరత్రా అనుమతుల కోసం నెలల తరబడి తిప్పించుకుంటున్నారు.

ప్రైవేటు చేతులకు పని

కొందరు వీఆర్‌ఓలు ప్రైవేటు వ్యక్తుల చేతికి పనులు అప్పగిస్తున్నారు. వీఆర్‌ఓలు సొంత పనులకు వెళితే ఆ సమయంలో అన్ని తానై ప్రైవేటు వ్యక్తులు తెరపైకి వస్తున్నారు. ఫోన్ల ద్వారా రాయబారాలు నడిపి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. చేతిలో చేయి వేసి బేరసారాలు చేసుకుని పనులు చేయిస్తుంటారు. చాలా వరకు ఇక్కడ డబ్బులిస్తే తప్ప పనులు జరగడం లేదు. ఇక వీఆర్‌ఏల స్థానంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు పనిచేస్తున్నారు. ప్రతి పనికీ రేట్ ఫిక్స్ చేసి కలెక్షన్ కింగ్‌లుగా అవతారమెత్తుతున్నారు. ఏ పనికైనా వారిని ఆశ్రయిస్తే చిటికెలో చేసి పెడుతున్నారు. వీఆర్‌ఓలను ప్రసన్నం చేసుకోవాలంటే, ముందుగా డమ్మీ వీఆర్‌ఏలను ఆశ్రయిస్తే తీసుకెళుతారు. ఇలా ప్రతి ఫైల్‌కు పైసలు ఇవ్వడంతో అనధికారిక వీఆర్‌ఏలపై ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు గొంతు విప్పుతున్నారు. ఇలానే కొనసాగితే కార్యాలయం భ్రష్టు పట్టడం ఖాయమని పలువురు అధికారుల వద్ద వాపోతున్నారు. కొందరు వీర్‌ఓలు, ప్రైవేటు వీఆర్‌ఏలు వ్యవహార శైలిపై అధికారులకుసైతం కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వెలుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



పనివేళ్లల్లో కచ్చితంగా ప్రతి ఒక్క వీఆర్‌ఓ వారి కేటాయించిన స్థానాల్లో ఉండాలి. ఇతరత్రా పనులు మానుకుని ప్రజా సేవకు పనిచేయాలి. ప్రజలను అక్కడకు, ఇక్కడకు తిప్పించుకోకూడదు. వారికి అందుబాటులో ఉండి సేవలందించాలి. కొంత మంది వీఆర్‌ఓలు అందుబాటులో లేరని ఫిర్యాదులు వస్తున్నాయి. వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు వ్యక్తులపై నిఘా పెడతాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో వారి ఆట కట్టిస్తాం.

-కళావతి, తహసీల్దార్, చిత్తూరు

క్లుప్తంగా

ప్రజావేదికలో అర్జీల వెల్లువ



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ గుర్రప్ప

పూతలపట్టు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను తహసీల్దార్ గుర్రప్ప నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. భూ సమస్యలు, మ్యూటేషన్, రేషన్ కార్డులో పేర్లు మార్చడం వంటి సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన తహసీల్దార్ సమస్యలను పరిష్కరించి అర్జీదారులకు తెలుపుతామని తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి



చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ సమాచార చట్టంపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మల్లకుంటలో సోమవారం ప్రజలకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే చట్టాల గురించి ముఖ్యంగా తెలుసుకోవాలన్నారు. ప్రజలకు సమాచార చట్టంలో సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌జీవో

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్ రహిత సమాజానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎన్‌జీఓ ప్రాజెక్టు మేనేజర్ సద్దాం పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని వన్‌డిపో గ్యారేజీలో సోమవారం హెచ్‌ఐవీ, టీబీ పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అవగాహనతోనే నివారణ సాధ్యమన్నారు. టీబీ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.

మెరుగైన వైద్యం అందజేస్తాం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మెరుగైన వైద్యం అందజేస్తామని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. 45మందికి పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరళ, హైమావతి, సుమతి, గీతలు పాల్గొన్నారు.

సాంకేతికతపై పట్టు అవసరం



క్షేత్రస్థాయి కార్యక్రమంలో పాల్గొన్న గిరింపేట నగరపాలక పాఠశాల విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు సాంకేతికతపై పట్టు అవసరమని గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్ అన్నారు. సాంకేతిక విద్యలో భాగంగా పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం క్షేత్ర స్థాయి పర్యటన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం అమలులో తమ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన పెంచుతున్నట్లు చెప్పారు. నగరంలోని ఓ బ్యూటీ అండ్ వెల్నెస్ సెంటర్‌లో సాంకేతిక విద్య మెలకువలను తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువరేఖ, ఒకేషనల్ కో–ఆర్డినేటర్ జయంతి పాల్గొన్నారు.

మొగిలీశ్వరాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వర స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యలపై స్పందించాలి



తహసీల్దార్‌కు అర్జీలు ఇస్తున్న బాధితులు

బంగారుపాళెం: గ్రీవెన్స్ డే సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. దారి, భూ సమస్య, పట్టా పుస్తకాలలో పేర్లు మార్పు, డెత్, బర్త సర్టిఫికెట్లు వంటి సమస్యలపై పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అధికారులు తమ పరిధిలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఊరి బయట టపాసుల విక్రయాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఈ ఏడాది దీపావళి పండుగకు ఊరి బయట టపాసులు విక్రయించాలని నిర్ణయించినట్లు చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం డివిజనల్ కమిటీ సభ్యులు మురకంబట్టులో స్థల పరిశీలన చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ చిత్తూరు నగరంలో టపాసుల విక్రయాలు చేసేందుకు తాత్కాలిక లైసెన్సులను ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టపాసుల తాత్కాలిక లైసెన్సుదారులకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు స్థలం పరిశీలించినట్లు చెప్పారు. చిత్తూరు నగరానికి సరిహద్దులో మురకంబట్టు వద్ద ఉన్న సర్వే నెంబర్ 102 (ప్రభుత్వ భూమి)లో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజనల్ కమిటీ స్థల పరిశీలన తర్వాత వన్‌మన్ కమిటీ నివేదిక ప్రకారం అగ్నిమాపక శాఖ నియమాలను అనుసరించి తాత్కాలిక షెడ్లు వేసుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. గతంలో గుర్తించిన పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల మైదానం స్థలాన్ని రద్దు చేసి మురకంబట్టు వద్దకు మార్చినట్లు ఆర్డీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, నగరపాలక సంస్థ ఏసీపీ నాగేంద్ర, చిత్తూరు అర్బన్ ఆర్‌ఐ సంతోష్ పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న డివిజనల్ స్థాయి కమిటీ అధికారులు

వినతులు త్వరగా పరిష్కరించండి



సమస్యలు వింటున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

7వ తేదీ లోపు విద్యుత్ రీడింగ్ తీయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: సకాలంలో విద్యుత్ బిల్లుల రీడింగ్స్ తీయాలని ట్రాన్స్‌కో చిత్తూరు జిల్లా ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. స్థానిక ఎస్‌ఈ కార్యాలయంలో సోమవారం చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు డివిజన్ల బిల్లురీడర్స్, కాంట్రాక్టర్‌తో సమావేశమయ్యారు. బిల్‌రీడింగ్ కాంట్రాక్ట్ డిస్కం మొత్తం ఒకరికి కేటాయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెల 7వ తేదీలోపు రీడింగ్ పూర్తి చేయాలని, రీడింగ్ తీసే సమయంలో డోర్‌లాక్ అయితే సంబంధిత సర్వీసుదారుడితో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలపాలన్నారు. యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో కలెక్షన్ తక్కువగా ఉందని, మీటర్లు పనిచేయకపోతే వాటిని సకాలంలో మార్పు చేయాలని, సమస్యలు ఉంటే ఏఈలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఫిర్యాదు

పూతలపట్టు: ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డిపల్లికి చెందిన సుబ్రమణ్యం సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని ప్రజాసమస్య పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం ఆయన పూతలపట్టులో విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 1333/3, 1360/2లో హార్టికల్చర్ ప్లాంటేషన్ వర్క్ ఐడీ–70355, 70232లలో రైతులు మామిడిచెట్లు పెట్టకుండానే గుంత తవ్వినట్టు బిల్లుల మంజూరు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయమై మండల ఉపాధి అధికారి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేయగా, మండల ఉపాధి కార్యాలయం నుంచి అర్జీదారుడికి ఫోన్ చేసి అర్జీలో చిరునామా తప్పుగా ఉందంటూ చెప్పారు. ఎవరికి చెప్పాలో తెలియక అర్జీదారుడు విలేకరులను ఆశ్రయించాడు. ఉన్నతాధికారులు ఉపాధిహామీలో అవినీతి జరగకుండా చూడాలని అర్జీదారుడు కోరాడు.

బాలికల హాస్టల్లో సమస్యల తిష్ట



హాస్టల్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు



పాచిపట్టి అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

గుడిపాల: బాలిక హాస్టల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఎస్సీ బాలికల హాస్టల్లో 20 మందికి పైగా బాలికలు ఉన్నారు. వర్షం వచ్చినప్పుడు స్లాబ్‌పైన పెచ్చులూడడంతో వర్షపు నీరంతా ఉరుస్తోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బాలికలు భయాందోళన చెందుతున్నారు. హాస్టల్లో ఉన్న ఫ్యాన్‌లు కూడా తిరగకపోవడంతో దోమల సమస్య అధికంగా ఉంది. టాయ్‌లెట్లు పాచిపట్టి అధ్వాన పరిస్థితుల్లో ఉంది. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులకు వేస్తున్న భోజనం కుడా నాణ్యత లేకుండా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. సంబంధిత అధికారులు హాస్టల్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు తీసుకోండి



మాధవరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వినయకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు రకహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం, గుడ్లు, చిక్కీలు తప్పక భుజించాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో కాంచి చల్లార్చిన నీరు తాగాలని వివరించారు. అప్రమత్తతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం



పోలీసు ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నెలలో ఓసారి పోలీసు కుటుంబ సభ్యులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం చిత్తూరు నగరంలోని పీజీఆర్ లైన్‌లోని పోలీసు ఆస్పత్రిలో పోలీసు కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి నాలుగు నెలలకోసారి రక్తదానం చేసి, సామాజిక బాధ్యతను చాటడంలో పోలీసులు ముందుండాలన్నారు. నిత్యం విధుల్లో తనమునకలై ఉన్న పోలీసులకు వైద్య పరీక్షలు తప్పనిసరని తెలిపారు. సరైన ఆరోగ్యం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఇక అవయవదానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చనిపోయిన తరువాత మానవ శరీరంలోని పలు అవయవాలు ఎందరికో పునర్జన్మను ఇస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఒక ఇంటికే సీసీ రోడ్డు!

- లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం
- అధికారం అడ్డు పెట్టుకుని టీడీపీ నేత నిర్వాకం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కాకమునుపే టీడీపీ కార్యకర్తలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. మొన్న ఇసుక, నిన్న మద్యం, నేడు సీసీ రోడ్లపై పడిన తెలుగు తమ్ముళ్లు దోచుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం తమ్ముళ్లకు భయపడుతూ వారు చెప్పిన పనులు చేస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణాల్లో టీడీపీ కార్యకర్తల మాటే ఫైనల్ అంటూ అధికారులు మౌనముద్రలో ఉన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో టీడీపీ కార్యకర్తలే సగం నగదును దుర్వినియోగం చేస్తున్నారు. దీనికి సంబంధిత అధికారులు వారికి సహాయపడుతున్నారు. సీసీ రోడ్లు మొదటగా అధికార పార్టీ నాయకుల ఇళ్లకు వేసిన తరువాతనే, గ్రామాల్లో వేయాలని తెలుగు తమ్ముళ్లు అధికారులకు హుకుం జారీ చేశారు. అధికారులు వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారు. ఫలితంగా ఒక ఇంటి కోసమే 100 మీటర్లకు పైగా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు అధికారులు ఆమోదం తెలిపారు.


పూతలపట్టు మండలంలో కూటమి ప్రభుత్వం అక్టోబర్ నెలలో 55 సీసీ రోడ్ల పనులను మంజూరు చేసింది. ఈ పనులకు గాను సుమారు రూ.2.18 కోట్లు విడుదల చేసింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికే అధికారులు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పూతలపట్టు పంచాయతీ కోట్లపల్లెలో మాత్రం టీడీపీ కార్యకర్త ఇంటికి సీసీ రోడ్డు వేస్తున్నారు. యల్లంపల్లిలోని ఓ టీడీపీ కార్యకర్త ఇంటికి ఏకంగా 100 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించారు.

ఆ గ్రామంలోని సీసీ రోడ్డు పనులకు రూ.5 లక్షలు మంజూరు చేసింది. కోట్లపల్లిలో కూడా ఓ కార్యకర్త ఇంటికి సింగిల్‌గా రోడ్డును నిర్మించారు. ఇదేంటని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి అందే అన్నిరకాల సదుపాయాలను నిలిపివేస్తానని ఆ కార్యకర్త బెదిరించారు. దీంతో ఈ గ్రామానికి రూ.6 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.



టీడీపీ నేత ఇంటి కోసం నిర్మించిన సీసీ రోడ్డు

పరిష్కరిస్తాం



సీసీ రోడ్ల విషయంలో మండలంలోని 53 గ్రామాల్లో పనులు ప్రారంభిస్తున్నారు. మట్టి రోడ్డు ఉన్న గ్రామాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి రోడ్డు పనులు ప్రారంభిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఒకే ఇంటికి సీసీ రోడ్డు ఉన్నట్లైతే వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.

- నాగరాజు, ఎంపీడీఓ , పూతలపట్టు.